జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 3 | అక్టోబర్ | 2026 • పేజీలు : 10



# కోయ భాష-సంస్కృతి సంప్రదాయాలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలి

- ప్రాచీన గోండి–కోయ భాషా పదాల మూలాలను గుర్తించాలి
- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**భద్రాచలం, అక్టోబర్ 2 (ప్రజాజ్యోతి):** ప్రాంతాలు వేరైనా ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, భాషా విధానం ఒకటేనని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ప్రాంతాలను బట్టి భాషల్లో తేడాలు ఉన్నప్పటికీ

మిగతా 2 లో...




# అప్పుడు కేసులు.. ఇప్పుడు మౌనం..!

- కౌలు రైతు పంట నరికివేతపై పోలీసుల వైఖరిలో మార్పెందుకు?
- రెవెన్యూ నివేదికలో కౌలు సాగు స్పష్టం.. గతంలో ఇదే భూమిపై రెండు ఎఫ్ ఐఆర్ లు
- జులై 20, 28న ఫిర్యాదులు.. ఆన్ లైన్ ద్వారా విన్నపం.. అయినా నమోదు కాని కేసు
- తహసీల్దార్ స్పష్టమైన సమాచారం ఇచ్చినా ముందుకు కదలని పోలీసు వ్యవస్థ
- రాజకీయ పలుకుబడికి తలొగ్గుతున్నారా? లక్ష్మీదేవిపల్లి పోలీసుల తీరుపై సందేహాలు..

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 2, ప్రజాజ్యోతి :** ఒకే భూమి..ఒకే కౌలు రైతు..ఒకే తరహా పంట నరికివేత! గతంలో ఇదే వ్యవహారంపై ఫిర్యాదులు అందితే చురుగ్గా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసులు, ఇప్పుడు మాత్రం వరుసగా ఫిర్యాదులు అందుతున్నా కేసు నమోదు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల గ్రామంలోని సర్వే నంబర్ 14/6 పరిధిలోని భూమిలో కౌలు రైతు పంట నరికివేత ఘటన స్థానికంగా తీవ్ర వివాదాస్పదంగా మారింది. కౌలు సాగుకు సంబంధించి రెవెన్యూ శాఖ పోలీసులకు అధికారికంగా నివేదిక ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో పోలీసుల చర్యలు కనిపించకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**తహసీల్దార్ నివేదికలో తేలిన వాస్తవాలు**

ఈ భూ వ్యవహారంలో అత్యంత కీలకమైన ఆధారంగా లక్ష్మీదేవిపల్లి మండల తహసీల్దార్ నివేదిక నిలుస్తోంది. 2026 జూలై 15న లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు తహసీల్దార్ పంపిన నివేదిక ప్రకారం..సర్వే నంబర్ 14/6లోని 39.34 ఎకరాల భూమిని 2014 ఏప్రిల్ 1న అజ్మీరా మురళికి లీజుకు ఇచ్చినట్లు స్పష్టంగా పేర్కొన్నారు. గిరిదావర్, మండల సర్వేయర్

మిగతా 2 లో...

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



**స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**నీటి పొదుపుపై ప్రజలకు ఎమ్మెల్యే జారె అవగాహన**

**దమ్మపేట, అక్టోబర్ 2 ( ప్రజాజ్యోతి):** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జారె ఆది నారాయణ అన్నారు. శుక్రవారం దమ్మపేట మండలంలోని పార్కలగండి, పట్వారిగూడెం, అంకంపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

**గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు**

ఆర్లపెంట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వీబీజీ–రామ్‌జీ గ్రామసభలో గ్రామపంచాయతీల అభివృద్ధికి

మిగతా 2 లో...

# మణుగూరులో "పంచాయితీ పేరుతో ఎమ్.కే గ్యాంగ్ 2"




4 లో

# ప్రజాజ్యోతి కథనాల ఎఫెక్ట్.. కదిలిన పంచాయతీ యంత్రాంగం!



- దుగినేపల్లి పంచాయతీ నిధుల వ్యవహారంపై అధికారికంగా షోకాజ్
- సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులకు నోటీసులు
- మూడు రోజుల్లోగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం
- వివరణ ఇవ్వకుంటే జిల్లా అధికారులకు నివేదిస్తామని స్పష్టీకరణ
- పంచాయతీ నిధుల వ్యవహారంపై జిల్లా పంచాయతీ అధికారి ఆరా
- బహిరంగ, నిష్పక్షపాత విచారణకు గ్రామస్తుల డిమాండ్

2 లో...












## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



(మొదటి పేజీ తరువాయి...)

చేపట్టనున్న సమగ్ర ప్రణాళికలను వివరించారు. గ్రామాల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**నీటి వృథాను అరికట్టాలి**

హర్‌ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా నీటి పొదుపుపై ప్రజలకు ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. నీరు ఎంతో విలువైనదని, రాబోయే తరాలకు నీటి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అవసరమైన మేరకే నీటిని వినియోగించి వృథాను అరికట్టాలని సూచించారు.

ప్రజలు సురక్షితమైన తాగునీటిని మాత్రమే వినియోగించాలని, కలుషిత నీటి వల్ల అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఆర్‌ఐలు బిక్షమయ్య, వీరస్వామి, గృహనిర్మాణ శాఖ నియోజకవర్గ పరిశీలకుడు జి.రాము, సర్పంచులు కూరం అర్జున్‌రావు, మోకాళ్ల గురుమూర్తి, కొమరం సుశీల, మడకం వరలక్ష్మి , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాక రమేష్, నాయకులు వాసం శ్రీను, చిన్నశెట్టి యుగంధర్, బొల్లికొండ నాగేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కోయ భాష–సంస్కృతి సంప్రదాయాలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలి

(మొదటి పేజీ తరువాయి...)



అర్థం ఒకటిగానే ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం గిరిజన భవన్‌లో నిర్వహించిన గోండి– కోయ నిఘంటువు వర్క్‌షాప్‌లో ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గోండి–కోయ గోత్రాల జెండాను ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివాసీ మహనీయులతో పాటు గాంధీజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోండి–కోయ భాష, సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రాచీనమైనవని తెలిపారు. భాషకు అధికారిక గుర్తింపు కోసం 2014 జూలై 7న హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించి, 2017లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు వివరించారు. ప్రాచీన కాలం నాటి భాషా మూలాలు, పదాలు, అక్షరాలను గుర్తించి, వివిధ రాష్ట్రాల్లోని గిరిజన తెగల ప్రతినిధులు ఐక్యంగా కృషిచేస్తే భాషకు ప్రత్యేక గుర్తింపు సాధ్యమవుతుందని అన్నారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ ఆదివాసీల భాష, సంస్కృతులకు సరైన గుర్తింపు లేకపోవడం వల్ల అవి అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. కోయ–గోండ్ సమాజం భాషను పరిరక్షించి అభివృద్ధి చేసుకునేందుకు తొమ్మిది రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు భాషను ప్రామాణీకరించేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ కోయ భాషలో మాట్లాడటంతో పాటు పిల్లలకు భాషను నేర్పించి సంస్కృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. కోయ భాష, సంస్కృతి, చరిత్రకు గుర్తింపు, గౌరవం దక్కేలా భద్రాచలం ఐటీడీఏ పూర్తి మద్దతుగా నిలుస్తుందని రాహుల్ తెలిపారు. కోయ భాషలో ప్రాథమిక విద్య, మ్యూజియం పునరుద్ధరణ, కోయ భాషా దినోత్సవం నిర్వహణ, కోయ రేల పాటల ఆల్బమ్, కోయ ఇలవేల్పుల పురాణ కథలను గ్రంథస్తం చేయడం వంటి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. అనంతరం ఆదివాసీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, సర్పంచ్ పూనెం కృష్ణదొర, ఏటీడీఓ రాధమ్మ, రిటైర్డ్ ఏసీఎంఓ రమణయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ నెహ్రూ, తొమ్మిది రాష్ట్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు కేసులు.. ఇప్పుడు మౌనం..!

(మొదటి పేజీ తరువాయి...)

క్షేత్రస్థాయి విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ వివరాలను ధ్రువీకరించారు. దాంతో పాటు మురళి 2014 నుంచి కౌలు రైతుగా యూకలిప్టస్ (జామాయిల్) మొక్కలు నాటి సాగు చేస్తున్నారని, 2018లో ఒకసారి, 2022లో మరోసారి కోతలు పూర్తయ్యాయని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. దీని ప్రకారం మురళి కౌలు సాగు చేయడం కేవలం వ్యక్తిగత వాదన కాదని, ప్రభుత్వ రెవెన్యూ శాఖ అధికారికంగా ధ్రువీకరించిన అంశమని నివేదిక ఆధారంగా స్పష్టమవుతోంది.

**అప్పుడేమో ఎఫ్ఐఆర్‌లు.. ఇప్పుడేమో సాకు..**

అయితే ఇదే భూమికి సంబంధించి గతంలోనూ కొందరు పంటను అనధికారికంగా నరికివేసినప్పుడు కౌలు రైతు, పట్టాదారులు ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు స్పందించారు. అప్పట్లో వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. ఆ సమయంలో పంట నరికివేతను చట్టరీత్యా నేరంగా పరిగణించిన పోలీసు వ్యవస్థ.. ఇప్పుడు అదే తరహా ఘటనపై ఫిర్యాదులు అందినా మౌనం వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మూడో విడత పంట చేతికొచ్చే దశలో జామాయిల్ చెట్లను అక్రమంగా నరికివేసిన ఘటనపై మురళి, పట్టాదారులు వరుసగా జూలై 20, జూలై 28 తేదీల్లో పోలీసులకు ఫిర్యాదులు చేశారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా కూడా విన్నవించుకున్నారు. అయినప్పటికీ కేసు నమోదు కాకపోవడమే ఇక్కడ ప్రధాన ప్రశ్నగా మారింది. ప్రస్తుతం పోలీసులు భూమి హక్కుల వివాదాన్ని సాకుగా చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే భూమి యాజమాన్య హక్కులు రెవెన్యూ శాఖ పరిధిలోని అంశమైనప్పటికీ.. అనుమతి లేకుండా పంటను ఎవరు నరికారు? నరికిన కలపను ఎక్కడికి తరలించారు? అన్నది దర్యాప్తులో తేలాల్సిన అంశం. దీనిపై విచారణ చేపట్టేందుకు పోలీసులకు చట్టపరంగా ఎలాంటి అడ్డంకి ఉందన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

**నరికివేత సాగుతున్నా.. పోలీసుల జోక్యం ఏది?**

ఇక ఈ పంట నరికివేతను వెంటనే నిలిపివేయాలని సంభందిత రెవెన్యూ అధికారులు పోలీసులకు సూచించినట్లు సమాచారం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దానిని అడ్డుకోవడంలో పోలీసులు చొరవ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో అధికారుల మధ్య సమన్వయం లోపించిందా? లేక నేతల జోక్యంతోనే అధికారులు పక్కకు తప్పుకున్నారా? అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. ఇంత బహిరంగంగా పంట నరికివేత జరుగుతున్నా, నరికిన కలప వాహనాల్లో తరలిపోతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్ల సామాన్యుల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోంది. వీటితో పాటు భూమి హక్కుల సాకుతో గతంలో లేని అంశాన్ని పోలీసులు ఇప్పుడు తెరపైకి తేవడం వెనుక ఉద్దేశం ఏమిటన్నది స్పష్టం కావాల్సి ఉంది. ఒకే భూమిపై గతంలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడం, తహసీల్దార్ అధికారికంగా లీజు వివరాలు నివేదించడం, వరుసగా ఫిర్యాదులు అందడం వంటి ఆధారాలు ఉన్నప్పటికీ గత 3 నెలల నుండి కేసు నమోదు చేయకపోవడం వెనుక అసలు కారణాలను ఉన్నతాధికారులు నిగ్గుతేల్చాల్సి ఉంది. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అన్నది స్పష్టం చేసి, కౌలు రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### రాజకీయ పలుకుబడి ప్రభావమేనా?

ఈ వ్యవహారంలో స్థానిక కాంగ్రెస్ నాయకుల జోక్యం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి ఉన్న కొందరు నేతలు తమ అంగబలం, అర్థబలంతో వ్యవహారాన్ని ప్రభావితం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు మరికొందరు కలిసి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారనే ఆరోపణలు, వారి ప్రభావంతోనే బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు చర్యలకు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంట నరికివేత సమయంలో కొందరు రౌడీషీటర్లుగా గుర్తింపు ఉన్న వ్యక్తులను సైతం అక్కడికి తీసుకువచ్చి నరికివేతకు అండగా మోహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత బహిరంగంగా పంట నరికివేత జరుగుతున్నా, వరుసగా ఫిర్యాదులు అందుతున్నా పోలీసులు స్పందించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పలుకుబడి, డబ్బు, అంగబల ప్రభావంతోనే పోలీసులు చర్యలకు దూరంగా ఉంటున్నారా? చట్టం అందరికీ సమానంగా వర్తించదా? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

**పోలీసులకు సూచించాం: శిరీష (లక్ష్మీదేవిపల్లి ఎమ్మార్వో)**

"ఈ విషయంపై ఫిర్యాదు అందిన వెంటనే భూమిని సర్వే చేయించి రికార్డు నమోదు చేశాం. మా విచారణలో మురళి కౌలుదారుడిగా ఉన్నట్లు తేలింది. 1960 నుంచి సదరు భూమి ఒకే పట్టాదారు పేరుతో నమోదై ఉన్నట్లు రికార్డుల పరిశీలనలో వెల్లడైంది. ఆ తర్వాత మరికొందరు భూమిపై హక్కులు కోరుతూ ఫిర్యాదులు చేశారు. ఏది ఏమైనా పంట నరికివేతను నిలిపివేయాలని పోలీసులకు సూచించాం. కానీ పోలీసులు నరికివేతను అడ్డుకోలేకపోయారు."

## ప్రజాజ్యోతి కథనాల ఎఫెక్ట్.. కదిలిన పంచాయతీ యంత్రాంగం!

**పినపాక, అక్టోబర్ 2: (ప్రజాజ్యోతి)** గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై 'ప్రజాజ్యోతి' దినపత్రికలో సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు వరుసగా ప్రచురితమైన కథనాల నేపథ్యంలో అధికారులు స్పందించారు. పంచాయతీ నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణలు, అనుమానాలపై వాస్తవాలను వెల్లడించాలని కోరుతూ పినపాక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి 02.10.2026న అధికారికంగా షోకాజ్ నోటీసు జారీ అయింది.

**సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులకు నోటీసులు**

దుగినేపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శితో పాటు సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించి 'ప్రజాజ్యోతి'లో ప్రచురితమైన వార్తల్లో పేర్కొన్న అంశాలపై వాస్తవ వివరాలతో వివరణ ఇవ్వాలని నోటీసులో ఆదేశించారు.

**మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి**

షోకాజ్ నోటీసు అందుకున్న మూడు రోజుల్లోగా పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన వాస్తవాలను లిఖితపూర్వకంగా ఎంపీఓకు సమర్పించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా తగిన వివరణ ఇవ్వని పక్షంలో ఈ వ్యవహారాన్ని జిల్లా అధికారులకు నివేదించి తదుపరి చర్యలకు పంపుతామని నోటీసులో పేర్కొన్నారు.

**కథనాలపై అధికారిక స్పందన**

దుగినేపల్లి పంచాయతీలో నిధుల ఖర్చు, పనుల అమలు, బిల్లులు, ఎంబీలు తదితర అంశాలపై గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్న అనుమానాలను 'ప్రజాజ్యోతి' వరుస కథనాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. రికార్డుల్లో చూపిన ఖర్చులకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పనులకు సంబంధం ఉందా?



GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE MANDAL PRAJA PARISHAD,PINAPAKA
SHOWCAUSE NOTICE NO MPO/PINAPAKA/2026,Dt.02.10.2026

Sub: Mandal Praja Parishad,Pinapaka Duginepally Grama Panchayat Adverse news published in PRAJAJYOTHI DAILY NEWS PAPER Explanation called for.

Ref:PRAJA JYOTHI DAILY NEWS PAPER,DT.29.9.2026 TO 02.10.2026.

It is brought to notice that, the adverse news published in PRAJA JYOTHI DAILY NEWS PAPER,DT.29.9.2026 TO 02.10.2026 regarding financial irregularities in utilisation of Grama Panchayat funds.

Therefore, the Secretary,Grama Panchayat,Duginepally and as well as the Sarpanch and Up-Sarpanch of Duginepally Grama Panchayat are hereby directed to explain the actual part in Utilisation of Grama Panchayat funds with in three days to the undersigned without fail. Otherwise, the matter will be reported to District Authorities for necessary action.

Mandal Panchayat Officer,
MPP,Pinapaka.

To
The Secretary,GP,Duginepally.
The Sarpanch & Upasarpanch,GP,Duginepally.
Copy

అనే ప్రశ్నలను కథనాల్లో ప్రస్తావించింది. తాజాగా అధికారులు అధికారికంగా షోకాజ్ నోటీసు జారీ చేయడంతో ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

**జిల్లా అధికారుల దృష్టికి..**

దుగినేపల్లి పంచాయతీ నిధుల వ్యవహారంపై జిల్లా పంచాయతీ అధికారి కూడా వివరాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. మండల స్థాయిలో జారీ చేసిన షోకాజ్ నోటీసుకు సంబంధితుల నుంచి వచ్చే వివరణ, పంచాయతీ రికార్డులు తదితర అంశాల ఆధారంగా ఉన్నతాధికారులు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**బహిరంగ విచారణకు గ్రామస్తుల డిమాండ్**

పంచాయతీ నిధుల వినియోగంపై వస్తున్న ఆరోపణలు, అనుమానాలపై కేవలం కార్యాలయ రికార్డులకే పరిమితం కాకుండా బహిరంగంగా, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. రికార్డుల్లో పేర్కొన్న పనులు వాస్తవంగా జరిగాయా? వాటి పరిమాణం, నాణ్యత ఎలా ఉంది? బిల్లులు, ఎంబీలు, చెల్లింపులకు అనుగుణంగా పనులు జరిగాయా? అనే అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిష్పక్షపాత విచారణ జరగాలి**

ఈ వ్యవహారంపై విచారణ ఎలాంటి ప్రభావాలకు, పైరవీలకు తావులేకుండా నిష్పక్షపాతంగా జరగాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, బిల్లులు, ఎంబీలు, వౌచర్లు తదితరాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

**చర్యలు ఉంటాయా?**

షోకాజ్ నోటీసులు జారీ కావడంతో దుగినేపల్లి సర్పంచ్, ఉపసర్పంచ్‌లపై తదుపరి చర్యలు ఉంటాయన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. అయితే ప్రస్తుతం ఎలాంటి తుది చర్య అధికారికంగా ప్రకటించలేదు. సంబంధితుల వివరణ, రికార్డుల పరిశీలన, అధికారుల విచారణ అనంతరం మాత్రమే తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**వాస్తవాలు తేలేనా?**

'ప్రజాజ్యోతి'లో వరుసగా వెలువడిన కథనాల నేపథ్యంలో అధికారికంగా షోకాజ్ నోటీసులు జారీ కావడంతో దుగినేపల్లి పంచాయతీ నిధుల వ్యవహారం ఇప్పుడు అధికారుల పరిశీలనలోకి వచ్చింది.

**మూడు రోజుల్లో సంబంధితులు ఇచ్చే వివరణ ఏమిటి?**

అధికారులు రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తారా? విచారణలో ఆరోపణలు, అనుమానాలపై ఎలాంటి వాస్తవాలు వెలుగులోకి వస్తాయి? అనే అంశాలపై స్థానికంగా ఆసక్తి నెలకొంది

# వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు





**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ/ అక్టోబర్ 2,(ప్రజా జ్యోతి)** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వర్తక సంఘం , చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలువది ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం పాల్వంచ పట్టణంలోని పలు ప్రాంతాలలో గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పట్టణంలోని బాబూజీ నగర్‌లో మహాత్మా గాంధీ ఫౌండేషన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమంలో ప్రకాష్‌పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పాల్వంచ మార్కెట్‌లోని మహాత్మాగాంధీజీ విగ్రహానికి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాస్, పాల్వంచ చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాష్, 40 డివిజన్ కాంగ్రెస్ ఇంచార్జి పెండ్యాల శ్రీనివాస్ ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ మహిళ నాయకురాలు పెండ్యాల రోజాలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అదేవిధంగా మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్డెంట్ ముక్కంటేశ్వరరావు ఆర్.ఎం. డాక్టర్ సోమరాజు దొర ఆధ్వర్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పాలు అందజేశారు, గాంధీజీ చూపిన సేవా మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకొని అవసరమైన వారికి సహాయం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు, చలువాది ప్రకాష్, పలువురు వక్తలు మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను ఆచరించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు,.ఈ కార్యక్రమంలో, గూడెపు శ్రీనివాస్,రాయపూడి ప్రదీప్, ఉమాశంకర్ హేమలత, నరిగ సుజాత, వారణాసి ధనలక్ష్మి టి శ్రీనివాస్, అయిత కేశవరావు, నెమలిపురి ఉప్పలయ్య, జూపల్లి దుర్గాప్రసాద్, బోగెల్లి, ప్రభాకర్, కంభం జనార్ధన్, కొల్లూరి శ్రీనివాస్, తనకం శివ, నవీన్, శ్రీనాథ్, కిరణ్ కుమార్, ప్రవీణ్, పట్టా బాబురావు, దాసరి సురేష్, సలీం, కిరణ్, రాంబాబు, చంద్రమౌళి,స్థానిక యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థల పరిరక్షణకు ఐక్య పోరాటం

- బూడిదిగడ్డ సర్వే నంబర్ 143లోని 15 కుంటల భూమిని కాపాడాలని స్థానికుల విజ్ఞప్తి
- కబ్జా ప్రయత్నాలను అడ్డుకుని.. ప్రజా అవసరాలకు స్థలాన్ని వినియోగించాలని కోరిన కమిటీ
- పట్టణ ప్రకృతి వనాన్ని కాపాడుతూ.. రూ.70 లక్షల కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలని అభ్యర్థన
- తొలగించిన ఇంటి నంబర్ల వ్యవహారంపై సమగ్ర విచారణకు విజ్ఞప్తి
- బూడిదిగడ్డలో ప్రెస్‌మీట్.. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం



**కొత్తగూడెం, అక్టోబర్ 2, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం పట్టణంలోని బూడిదిగడ్డ ప్రభుత్వ పాఠశాలను ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 143లోని సుమారు 15 కుంటల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని బూడిదిగడ్డ పరిరక్షణ కమిటీ కోరింది. ఈ మేరకు కార్పొరేషన్ పరిధిలోని 10, 11, 49వ డివిజన్లకు చెందిన ప్రజలు శుక్రవారం సంబంధిత స్థలంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. స్థలంలో కొంత భాగంలో ఇప్పటికే పట్టణ ప్రకృతి వనం కొనసాగుతోందని తెలిపారు. మిగిలిన ప్రాంతాన్ని కూడా ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చూడాలని, భూమి అన్యాక్రాంతం కాకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఈ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలను వారు ప్రస్తావించారు. గతంలో రాజకీయ పలుకుబడి ఉన్న కొందరికి సంబంధించిన ఎనిమిది మందికి ఇంటి నంబర్లు జారీ అయినట్లు, వాటిపై ఫిర్యాదులు రావడంతో అనంతరం తొలగించినట్లు తెలిపారు. అయితే అక్కడ ఎప్పటి నుంచీ ఇళ్లు, గుడిసెలు లేదా శాశ్వత నిర్మాణాలు లేవని పేర్కొన్నారు. తొలగించిన పాత ఇంటి నంబర్లను ఆధారంగా చేసుకుని స్థలంపై హక్కులు చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో.. వాటి జారీ, తొలగింపునకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించాలని కోరారు. సర్వే నంబర్ 143కు సంబంధించిన అసలు రికార్డులు, ఇంటి నంబర్ల జారీకి ఆధారాలు, వాటిని తొలగించిన కారణాలను అధికారులు స్పష్టం చేయాలని తెలిపారు. ఇప్పటికే ఇదే స్థలంలో రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరై రెండేళ్లు గడిచినా పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. 2024లో నిధులు మంజూరు చేసి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ నిర్మాణం ముందుకు సాగలేదన్నారు. బూడిదిగడ్డతో పాటు 10, 11, 49వ డివిజన్ల ప్రజలకు ఉపయోగపడేలా వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం అవసరమని తెలిపారు. పెండింగ్ ప్రక్రియలను పూర్తి చేసి నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని కోరారు. ప్రెస్‌మీట్ అనంతరం కమిటీ ప్రతినిధులు, స్థానికులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. స్థల పరిరక్షణతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి పనులు ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దామోదర్ యాదవ్, ఈరెల్లి నాగేశ్వరరావు, గొడుగు శ్రీధర్ యాదవ్, పలనాటి ప్రశాంత్, ఈసం చిన్నస్వామి, సబ్బని సంపత్, ఎండి కాజా, రాజయ్య, రాజు తదితరులతో పాటు బూడిదిగడ్డ బస్తీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ–శాస్త్రి జయంతి



**ఇల్లందు, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి )** వాసవి క్లబ్, వనిత క్రౌన్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిలను పురస్కరించుకొని వాసవి క్లబ్, వనిత క్రౌన్ ఇల్లందు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. అంబజార్ గాంధీ చౌక్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి వాసవి క్లబ్ అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్, వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ప్రధాన కార్యదర్శి తీర్దాల నాగరాజు, కోశాధికారి సముద్రాల ఉషారాణి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఫౌండర్ గౌరీశెట్టి పురుషోత్తం తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, ఆర్య వైశ్య ప్రముఖ వైద్యురాలు పసుమర్తి సాయి చరిష్మా మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట కొబ్బరికాయ కొట్టి, పూలతో నివాళులర్పించారు. అనంతరం మెయిన్ రోడ్ ఎల్బిఎస్ నగర్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు గౌరీశెట్టి కృష్ణ, ఆర్య వైశ్య పెద్దలు సంక సత్య నాగేంద్ర శ్యామ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ నాయకులు మాట్లాడుతూ సత్యం, ధర్మం, అహింస మార్గంలో దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీ, "జై జవాన్–జై కిసాన్" నినాదంతో దేశ సేవకు స్ఫూర్తినిచ్చిన లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆఫీసర్స్ అర్వపల్లి రాధాకృష్ణ, పుల్లూరు సతీష్, జొన్నల ఉపేందర్ నాథ్ గుప్తా, యెలుగురి మధుబాబు, జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు గౌరీశెట్టి పురుషోత్తం, చందా చంద్రశేఖర్, గౌరీశెట్టి కృష్ణ, దొడ్డా రాజు, వాసవి క్లబ్ సభ్యులు, ఇల్లందు ఆర్య వైశ్య ప్రముఖులు తాటిపల్లి సుబ్బారావు, సంక సత్య నాగేంద్ర శ్యామ్, యామసాని నవీన్, గ్రందె సురేష్, రామిడి శంకర్, చారుగుండ్ల రాజేశ్వరరావు, దివ్వెల నాగేశ్వరావు, కురువెల్లి రాజేశ్వరరావు, చిన్నారులు బోనగిరి సంహిత్, కటకం స్ఫూర్తి, మోహిత్, రోహన్ష్, సముద్రాల షణ్ముఖి, త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముని ఆశయాలే ఆదర్శంగా ముందుకు సాగాలి

- గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 2, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అహింస, సత్యాగ్రహం, శాంతి మార్గాలను దేశానికి అందించిన మహాత్మా గాంధీజీ సేవలను నాయకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్, వనమా గాంధీ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ పాట షూటింగ్‌లో దండు సారయ్య సందడి



**ఇల్లందు, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి )** సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని భూపాలపల్లి జిల్లాలోని కమలాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక బతుకమ్మ పాట షూటింగ్‌లో ఇల్లందు 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య పాల్గొని సందడి చేశారు. ప్రముఖ ఫోక్ డాన్సర్ జాను లిరితో కలిసి ఆయన సాంగ్ షూటింగ్‌లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలు, బతుకమ్మ పండుగ వైభవాన్ని ప్రతిబింబించేలా ఈ ప్రత్యేక సాంగ్‌ను రూపొందిస్తున్నారు. భూపాలపల్లి ప్రాంతంలోని ప్రకృతి అందాల మధ్య కొనసాగిన షూటింగ్‌లో పలువురు కళాకారులు, డాన్సర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను ప్రతిబింబించేలా పాటను రూపొందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

» భూపాలపల్లి జిల్లా డాన్స్ యూనియన్ ఆధ్వర్యంలో దండు సారయ్య కు ఘన సన్మానం



బతుకమ్మ పాట షూటింగ్ సందర్భంగా భూపాలపల్లి జిల్లా డాన్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇల్లందు 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య, ప్రముఖ ఫోక్ డాన్సర్ జాను లిరిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దండు సారయ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, మన జానపద కళలు, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కళాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.తెలంగాణ పండుగలు, జానపద కళలు, సంప్రదాయాలను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా రూపొందుతున్న బతుకమ్మ సాంగ్ విజయవంతం కావాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

## అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా ప్రత్యేక గ్రామసభలు

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచనలతో గ్రామాభివృద్ధికి కార్యాచరణ
- పలువురు లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 2, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిజి రామ్‌జీ ప్రత్యేక గ్రామసభల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు.ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు విధుల పట్ల అలసత్వం చూపకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని సూచించారు. సర్పంచ్ గ్రామానికి ప్రథమ పౌరుడిగా గ్రామాభివృద్ధికి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామపంచాయతీ సమావేశాల్లో తీసుకున్న ముఖ్యమైన అభివృద్ధి నిర్ణయాలను ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు.ప్రతి గ్రామపంచాయతీకి వార్షిక అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకుని, వాటి ప్రకారం అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎప్పటికప్పుడు అందిస్తానని తెలిపారు.కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు పర్సా వెంకటేశ్వరావు, భానోత్ భీముడు, వేముల రమణారావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేముల నరేష్, ఎమ్మార్వో స్వర్ణ, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పరిశుద్ధ కార్మికులదే





**ఇల్లందు, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి )** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పరిశుద్ధ కార్మికులదేనని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు పిపిటి కిట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం, భధ్రతను దృష్టిలో ఉంచుకొని అందరికి పిపిఈ కిట్లు పంపిణి చేస్తున్నామన్నారు. ఇల్లందు పరిశుభ్ర భాధ్యత కార్మికులపై ఎంత ఉందో, పట్టణ ప్రజానికంపై కుడా ఉందని గుర్తు చేశారు. మన ఇల్లందు పట్టణాన్ని సుదరికరణ పట్టణంగా మన ప్రజా ప్రభుత్వంలో తీర్చి దిద్దుకుందామని పేర్కొన్నారు. ముందుగా గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కమిషనర్ సందీప్, వైస్ చైర్మన్ పెండేల రాజు, అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మణుగూరులో "పంచాయతీ పేరుతో ఎమ్.కే గ్యాంగ్ 2"

మణుగూరులో "పంచాయతీల పేరుతో ఎమ్.కే గ్యాంగ్ 2" ముఠా ఆగడాలు ఏమాత్రం ఆగడం లేదు. గురువారం 'ప్రజాజ్యోతి' దినపత్రికలో ప్రచురించిన కథనం తర్వాత కూడా వారి తీరులో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. కుల సంఘం పేరుతో, పెద్దమనుషుల ముసుగులో దందా చేస్తున్న ఈ ముఠా, ఇప్పటికీ అమాయక కుటుంబాలను టార్గెట్ చేస్తూనే ఉంది. భర్తకు తెలియకుండా భార్యకు, భార్యకు తెలియకుండా భర్తకు లేనిపోని మాటలు చేరవేసి, వారి మధ్య చిచ్చు పెడుతూ విడిపోయేలా చేస్తున్నారు. ఆ తర్వాత పంచాయతీ పేరుతో ఇరువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠాలో కీలకంగా వ్యవహరిస్తున్న ఒక వ్యక్తి ఇటీవల ఒక కేసులో జైలుకు వెళ్లినా సిగ్గు రాకపోగా, మిగిలిన సభ్యులు మాత్రం తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూ రెచ్చిపోతుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఫ్యామిలీ పంచాయతీలే టార్గెట్..!

- పంచాయతీ పేరుతో ఓ టీమ్ బ్లాక్ మెయిల్
- మణుగూరులో ఆగని ఆ ముఠా ఆగడాలు
- భార్యభర్తలిద్దరికీ చిచ్చుపెట్టి డబ్బు దండుకుంటున్న వైనం
- ఒక వైపు పంచాయతీ దందా..! మరో వైపు వడ్డీ దందా...!!
- వడ్డీ ఇవ్వకపోతే ఇంట్లోనే కూర్చుంటా అని బెదిరింపులు
- బాధిత కుటుంబాలను బెదిరిస్తున్న టీమ్
- జైలుకు వెళ్లినా మారని తీరు..! బాధితుల ఇళ్లలోనే మందు పార్టీలు, మహిళలపై కన్ను
- పోలీసులు ఇళ్లలో తనిఖీ చేస్తే డొంకంతా బయటకే...ముఠా గుట్టు విప్పుతున్న కొందరు బాధితులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, అక్టోబర్ 2, ప్రజాజ్యోతి

మణుగూరు ప్రాంతంలో సాగుతున్న అక్రమ పంచాయతీల దందా ఇప్పుడు మరింత కొత్త కోణంలోకి వెళ్తోంది. అమాయక కుటుంబాలను టార్గెట్ చేసి డబ్బులు సంపాదించడమే ఈ ముఠా ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. భార్యాభర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలు వస్తే చాలు, వెంటనే రంగంలోకి దిగుతున్నారు. భర్తకు తెలియకుండా భార్యకు, భార్యకు తెలియకుండా భర్తకు లేనిపోని మాటలు, అబద్ధపు ప్రచారాలు చేరవేసి ఇద్దరి మధ్య పెద్ద గొడవలు సృష్టిస్తున్నారు. దీంతో కలిసి ఉన్న కుటుంబాలు కూడా విడిపోయే పరిస్థితి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొడవ పెద్దదయ్యాక మేమే పెద్ద మనుషులమంటూ ఎంట్రీ ఇచ్చి, పంచాయతీ పేరుతో ఇరువురి నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.




**›› వడ్డీ దందా, వసూళ్ల దందాలో ఆ మహిళ కీలకం**

ఈ అక్రమ పంచాయతీల ముఠాలో ఓ మహిళ పాత్ర ఇప్పుడు కీలకంగా మారింది. వడ్డీ వ్యాపారం, వసూళ్ల దందాలో ఆమె ముందుండి నడిపిస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అవసరంలో ఉన్న కుటుంబాలకు అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి, ఆ తర్వాత వారి ఇళ్లలోకి నేరుగా వెళ్లి దౌర్జన్యానికి పాల్పడుతోంది. వడ్డీతో సహా డబ్బులు ఇవ్వకపోతే మీ ఇంట్లోనే తిష్టవేసి కూర్చుంటా, బయటకు రాను అంటూ బాధిత మహిళలను, కుటుంబ సభ్యులను నానా బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడుతోందని బాధితులు వాపోతున్నారు. ఈ ముఠా ఇళ్లలో అక్రమంగా ఎంత మంది దగ్గర నుంచి వడ్డీ పత్రాలు, తాకట్టు పెట్టుకున్న వాహనాలు, పత్రాలు ఉన్నాయనని భాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వీరి ఇళ్లలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తే, ఈ అక్రమ వడ్డీ దందా గుట్టు మొత్తం బయటపడుతుందని స్థానికులు గట్టిగా చెబుతున్నారు.

**›› బాధితుల ఇళ్లలోనే మందు పార్టీలు.. ఆ మహిళలపై కన్ను...బయటపడుతున్న ముఠా బాగోతం...**

అన్నింటికంటే అత్యంత దారుణం, దిగ్భ్రాంతికర అంశం ఏంటంటే, ఈ ముఠా సభ్యులు బాధితుల ఇళ్లలోకే చొరబడి ఆగడాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. పంచాయతీ పేరుతో, వడ్డీ వసూళ్ల పేరుతో బాధిత కుటుంబాల ఇళ్లలోకి వెళ్లి అక్కడే మద్యం సేవిస్తూ మందు పార్టీలు చేసుకోవడం గమనార్హం. అంతటితో ఆగకుండా ఆ ఇంట్లోని మహిళలపైనే కన్నేస్తూ, వారితో అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇన్నాళ్లు భయంతో బయటకు రాని ఎందరో బాధితులు ఇప్పుడు ఒక్కొక్కరుగా ధైర్యం చేసి ముందుకు వస్తుండటంతో ఈ కామాంధుల ముఠా అసలు స్వరూపం బట్టబయలవుతోంది. ఈ విషయంపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఇలాంటి కీచక ముఠాపై కఠిన చర్యలు తీసుకొని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని మణుగూరు ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి ):** నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం భారత మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి అని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జవ్వాది నరేంద్రబాబు అన్నారు. శుక్రవారం వనవాసీ కళ్యాణ పరిషత్ శబరి బాలికా విద్యార్థి నిలయంలో లాల్ బహదూర్ శాస్త్రి 121వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ 1904 అక్టోబర్ 2న ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్‌సరాయ్‌లో నిరుపేద కుటుంబంలో జన్మించిన శాస్త్రి, చిన్నతనంలోనే మహాత్మాగాంధీ పిలుపుతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ మరణానంతరం 1964లో దేశ రెండో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారని అన్నారు.ంకేవలం 18 నెలల పదవీకాలంలోనే శాస్త్రి తీసుకున్న నిర్ణయాలు దేశ చరిత్రలో కీలకంగా నిలిచాయని అన్నారు. 1965లో పాకిస్థాన్ భారత్‌పై దాడి చేసిన సమయంలో దేశాన్ని రక్షించేందుకు సైనికులు పోరాడుతుంటే, దేశానికి అవసరమైన ఆహారాన్ని అందించేందుకు రైతులు కృషి చేయాలని పిలుపునిస్తూ 'జై జవాన్ జై కిసాన్' నినాదంతో ప్రజల్లో స్ఫూర్తి నింపారని గుర్తుచేశారు.రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేసిన ఘటన ఆయన నిజాయితీకి నిదర్శనమని అన్నారు. హరిత విప్లవం, శ్వేత విప్లవానికి పునాది వేసి దేశాన్ని ఆహార కొరత నుంచి గట్టెక్కించేందుకు కృషి చేశారని తెలిపారు. ప్రధానమంత్రి హోదాలో ఉన్నప్పటికీ సొంత కారు కొనుగోలుకు బ్యాంకు రుణం తీసుకున్నంత నిరాడంబరమైన జీవితం గడిపిన శాస్త్రి నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు.1966 జనవరి 11న తాష్కెంట్ ఒప్పందం అనంతరం ఆయన మృతి చెందడం దేశానికి తీరని లోటని అన్నారు. ఆయన మృతి చుట్టూ ఉన్న అనుమానాలు నేటికీ చర్చనీయాంశంగానే ఉన్నాయని పేర్కొన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు.అనంతరం పలువురు శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, కొమరం భీం విద్యార్థి నిలయం కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్‌బాబు, శబరి బాలికా నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి, కమిటీ సభ్యులు పోలిన రమాదేవి, బుటారి సుజాత, నిలయ ప్రముఖులు వరలక్ష్మి , సంతోష్, విద్యార్థినులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు షరతులు లేని హెల్త్ కార్డులు ఇవ్వాలి

- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఉద్యోగులతో సమానంగా వైద్య సదుపాయాలు కల్పించాలి
- టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డుల ద్వారా విన్నపం



**కొత్తగూడెం, అక్టోబర్ 2, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి ఆంక్షలు, షరతులు లేకుండా హెల్త్ కార్డులు మంజూరు చేసి ఉద్యోగులతో సమానంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా తమ విజ్ఞప్తిని తెలియజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కల్లోజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతున్నప్పటికీ.. తమ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించడం లేదని అన్నారు. ఇకనైనా జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి, అనంతరం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టడం ద్వారా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా హెల్త్ కార్డులు మంజూరు చేసి, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులతో పాటు ఇళ్ల స్థలాలు, మెరుగైన వైద్య సదుపాయాలు, ఇతర సం క్షేమ పథకాలు అందించి ప్రభుత్వం వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్ వర్కింగ్ జర్నలిస్టుల విభాగం) జిల్లా అధ్యక్షుడు మట్టికొండ రవి, సహాయ కార్యదర్శి కాగితపు వెంకటేశ్వరరావు, సాక్షి బ్యూరో కృష్ణ గోవింద్, మోటమర్రి రామకృష్ణ, సీమకుర్తి రామకృష్ణ, టీటీడబ్ల్యూజేఏ అధ్యక్షుడు మాలోత్ అశోక్, ట్రెజరరీ రాందాస్ నాయక్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చావా పాపారావు, కృష్ణారావు, రమేష్, రమణ, తారక్, ప్రవీణ్, ఈశ్వర్, షబ్బీర్, శ్రీనివాస్, రాందాస్, జక్కంపూడి నరేష్, సత్య, శనగ లక్ష్మణ్, రహీం, స్వామి, గుంటుపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం సమరశంఖం

- శుక్రవారం టియుడబ్ల్యూజే -ఐజేయు ఆధ్వర్యంలో భారు నిరసన
- అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ
- తదుపరి కలెక్టరేట్ వద్ద ధర్నా
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజకీయ పార్టీల నేతల సంఘీభావం






**కొత్తగూడెం, అక్టోబర్ 2, ప్రజాజ్యోతి:** జర్నలిస్టుల హక్కులు, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, గృహ వసతి, సంక్షేమ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జునుముల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ, బూర్గంపాడు, చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు ముందుగా పోస్టాఫీస్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. తదుపరి జర్నలిస్టులు బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత, వృత్తిపరమైన రక్షణ, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

### ›› ఇళ్ల స్థలాల కేటాయింపునకు కృషి : సాబీర్ భాష

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ భాష మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించారని తెలిపారు. సింగరేణి ప్రధాన కార్యాలయం సమీపంలో జర్నలిస్టుల ఇళ్ల కాలనీ కోసం 10 ఎకరాల స్థలాన్ని సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. అర్హులైన జర్నలిస్టుల జాబితాను సంఘాలు సమన్వయంతో రూపొందించుకోవాలని సూచించారు.

### ›› సమస్య త్వరలో పరిష్కారం : మేయర్

మున్సిపల్ మేయర్ మూడు గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య త్వరలో ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. కేటాయించిన స్థలానికి రక్షణ కల్పించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. జర్నలిస్టు సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

### ›› సమగ్ర కార్యాచరణ అవసరం : జాగు వెంకటరత్నం

టీయూడబ్ల్యూజే–ఐజేయూ జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు. జర్నలిస్టుల భద్రత, ఆరోగ్యం, గృహ వసతి, సంక్షేమంపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

### ›› రాజకీయాలకు అతీతంగా మద్దతు

బీఆర్ఎస్ పాల్వంచ పట్టణ అధ్యక్షుడు రాజు గౌడ్, సీపీఐ మాస్‌లైన్ నాయకుడు బిక్షం, జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కామేష్, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, నాగ సీతారాములు, కొత్వాల శ్రీనివాసరావు, మండే వీర హనుమంతు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, వారి వృత్తిపరమైన భద్రత, సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు దుద్దుకూరి రామారావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నవీన్, కార్యదర్శి నాగచంద్ర, ప్రింట్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు వందా సత్యానంద్, శంకర్, చంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు అబ్బురామ్, కార్యదర్శి నక్క శ్యామ్సన్, పినపాక నియోజకవర్గ కార్యదర్శి బర్ల జోషి, జూలూరుపాడు మండల కార్యదర్శి సీహెచ్ నర్సింహారావు, పురం శ్రీనివాస్, హరి, జాన్సన్ డేవిడ్, రాజేష్, శేఖర్, కోలా కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ఫర్టిలైజర్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా పుప్పాల



**ఇల్లందు, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి)** ఇల్లందు మండల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షునిగా పుప్పాల ఉపేందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొద్దుటూరు నాగేశ్వరరావు, నారాయణ దాస్ లాహోటి, మెట్ల కృష్ణ, ఎస్ రమేష్, కాటేపల్లి నవీన్, సభ్యులు పాల్గొన్నారు.

## శబరి నిలయానికి బియ్యం, పండ్ల వితరణ



**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి):** విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతూ, చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను అలవరచడమే వనవాసీ కల్యాణ పరిషత్ ధ్యేయమని వనవాసీ విద్యార్థి నిలయం గౌరవ సలహాదారు బీవీఎస్ఎల్ నర్సింహారావు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా బుక్‌స్టాల్ యజమాని చిల్లంచర్ల కోటేశ్వరరావు–అనంత సౌభాగ్యలక్ష్మి దంపతులు చర్లలోని వనవాసీ శబరి బాలికా విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యం, పండ్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా శబరి నిలయ కార్యదర్శి బందా స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సింహారావు మాట్లాడుతూ నిరుపేద ఆదివాసీ విద్యార్థినుల విద్య కోసం తెలంగాణలోనే వనవాసీ ఆధ్వర్యంలో తొలి బాలికా విద్యార్థి నిలయాన్ని చర్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులకు వసతితో పాటు విద్యను అందిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాట వేస్తున్నామని అన్నారు. వనవాసీ సంస్థ దాతల సహకారంతో కొనసాగుతోందని, వారి సేవలు మరువలేనివని కొమరం భీం విద్యార్థి నిలయానికి ప్రతి ఏటా కోటేశ్వరరావు దంపతులు రెండు క్వింటాళ్ల బియ్యం అందిస్తున్నారని, ఈసారి శబరి నిలయానికి కూడా వితరణ అందించడం అభినందనీయమన్నారు. ఇందుకు నిలయ కమిటీ సభ్యులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ గిరిజన వికాసం కోసం దేశవ్యాప్తంగా విద్యార్థి నిలయాలతో పాటు గ్రామాల్లో విద్యా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల చదువులకు దాతలు సహకరించడం సంతోషకరమన్నారు. గోగికార్ రాంలక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్‌బాబు, పోలిన రమాదేవి, చిల్లంచర్ల కోటేశ్వరరావు, వరలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గ్రామసభలో అభివృద్ధి పనులపై చర్చ

**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి):** మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్ల మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా గ్రామపంచాయతీల అభివృద్ధికి వీబీజీ రామ్‌జీ పథకం కింద అనుమతించబడిన 375 పనులపై గ్రామసభల్లో చర్చించారు. చర్ల మేజర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణ అర్జున్‌రావు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పనులపై ప్రజలతో చర్చించి, అవసరమైన పనులకు ప్రాధాన్యత కల్పించే అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యక్రమ అధికారి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సాంకేతిక సహాయకుడు ఉమామహేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మాగాంధీ జయంతి



**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి ):** చర్ల భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరంలో మహాత్మాగాంధీ పోషించిన కీలక పాత్రతో పాటు దేశానికి ఆయన అందించిన సేవలను నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ అహింస, సత్యం, శాంతి, సహనం వంటి విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు మహాత్మాగాంధీ అని అన్నారు. గాంధీజీ ఆశయ సాధనలో భాగంగా కేసీఆర్ 2014 అక్టోబర్ 2న తె లంగాణ లోని పేద ఆడబిడ్డల కోసం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ పథకం ద్వారా 12 సంవత్సరాల్లో 12.70 లక్షల కుటుంబాలకు రూ.11, 130 కోట్ల మేర లబ్ధి చేకూరిందని దేశ సాధనలో గాంధీజీ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లెబ్బాయి, అంబాజీ సతీష్, గోరింట వెంకటేశ్వరరావు, పాసిగంటి సంతోష్, మేడబత్తిని గోవర్ధన్, గాదంశెట్టి కిషోర్, ఇన్నమూరి సృజన్, కుకడపు సాయి, వంకాయల వినోద్, నరసింహారావు, పంజా సుమంత్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్



**బూర్గంపహాడ్,అక్టోబర్2(ప్రజా జ్యోతి ):** శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని జింకలగూడెం గ్రామంలో పోలీసు సిబ్బంది,నార్కోటిక్ డాగ్ ఫోర్స్‌తో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి,ఇతర మత్తు పదార్థాల నివారణ అందరి బాధ్యత అన్నారు.యువత గంజాయి,మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.అనుమానితులు,అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేని 40 వాహనాలను సీజ్ చేశారు.గంజాయి సేవనం,అక్రమ రవాణా,పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ సూచించారు.చేతబడి, బాణామతి వంటి మూఢనమ్మకాలను నమ్మి ఎవరినీ హింసించవద్దన్నారు. వాహనదారులు తప్పనిసరిగా పత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్, బూర్గంపహాడ్ మండల సబ్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్,నాగ భిక్షం,రామ్మూర్తి,పాల్వంచ టౌన్ ఎస్ఐలు నాగరాజు,విజయ,పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్,ములకలపల్లి ఎస్ఐ మధు ప్రసాద్,డాగ్స్ స్క్వాడ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీకి ఘన నివాళులు



**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి ):** చర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గుండేపూడి భాస్కరరావు, మడకం పద్మ, లంక రాజు, మేడబత్తిని వాసు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మచ్చ రాజా, సుధాకర్, పుగాకు సత్తిబాబు, భాస్కర్, నర్సింహమూర్తి, దారిశెట్టి బ్రదర్స్, పవన్, పొగల రాము, హరిబాబు, చిత్తయ్య, అఖిల్‌తో పాటు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో గ్రామసభ

- బస్టాండ్ లో పెట్రోల్ బంక్ తొలగింపు మా పరిధిలో లేదు
- ఆర్టీసీదే పూర్తి అధికారం: సర్పంచ్ పగడాల రమాదేవి



**దమ్మపేట, అక్టోబర్ 2( ప్రజా జ్యోతి ):** దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లు దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వీబీ-జీ రామ్ జీ పథకం అమలు, గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల గుర్తింపు, ఉపాధి హామీ కార్డుల జారీ, పని దినాలు, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు గ్రామస్థులకు వివరించారు. గ్రామ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

### పెట్రోల్ బంక్ పై అభ్యంతరం

దమ్మపేట బస్టాండ్ ప్రాంగణంలో నిర్మించిన పెట్రోల్ బంక్ అంశంపై గ్రామసభలో గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బస్టాండ్ ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించి అభివృద్ధి చేయాలని కోరారు. పెట్రోల్ బంక్ నిర్మాణంపై పంచాయతీ తీర్మానం చేసి సంబంధిత అధికారులకు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీనిపై సర్పంచ్ పగడాల రమాదేవి మాట్లాడుతూ బస్టాండ్ లో నిర్మించిన పెట్రోల్ బంక్ ను తొలగించే అధికారం గ్రామ పంచాయతీకి లేదని, ఆర్టీసీ సంస్థ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నాయకుడు చిన్నశెట్టి యుగంధర్ మాట్లాడుతూ బస్టాండ్ అభివృద్ధికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ద్వారా సుమారు రూ.90 లక్షల నిధులు సమకూర్చినట్లు తెలిపారు. బస్టాండ్ అభివృద్ధి అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గ్రామ పెద్ద పగడాల రాంబాబు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో చేయాల్సిన పనులను చేపడుతున్నామని, అయితే బస్టాండ్ లోని పెట్రోల్ బంక్ ను తొలగించే అధికారం పంచాయతీకి లేదని తెలిపారు.

### వరద నీటికి కాలువ ఏర్పాటు చేయాలి

అప్పికుంట చెరువు నుంచి వచ్చే వరద నీరు మోడల్ కాలనీ, గాయత్రినగర్, అర్బన్ కాలనీ జంక్షన్ వద్ద రహదారుల పైకి రాకుండా కాలువ నిర్మించి రాంజీ కుంట మీదుగా కోమలచెరువుకు మళ్లించాలని గట్ల నాగరాజు కోరారు.ఈ గ్రామ సభలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, ఉయ్యాల లక్ష్మీనారాయణ, పూనెం పోలమ్మ, బద్దె వెంకట లీల, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, దాసరోజు సరిత రామారావు, గ్రామస్తులు అత్యం వెంకటేశ్వరరావు, చిన్నశెట్టి చిట్టిబాబు, పండూరి వీరబాబు, పసుమర్తి మురళి, పసుపులేటి కృష్ణారావు, రహీం, యార్లగడ్డ ఈశ్వరరావు, నల్లగట్ల సత్యంబాబు, గట్ల సర్వేశ్వరరావు, నాగరా జు, పిట్టల శ్రీనివాసరావు, ఎస్ కే వలీ, సుధా ప్రసాద్, గంగిశెట్టి వెంకన్న, ఆరేటి రాజు, అంగన్వాడి టీచర్లు, ఆ శాలు, పత్రిక విలేకరులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి పథకానికి 12 ఏళ్లు

- కేసీఆర్ చిత్రపటానికి బిఆర్ఎస్ నేతల పాలాభిషేకం



**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి ):** కల్యాణలక్ష్మి పథకం ప్రారంభించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చర్లలోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, భద్రాచలం నియోజకవర్గ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ సూచనలతో మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ 2014 అక్టోబర్ 2న కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించిందన్నారు అని పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 12.71 లక్షల కుటుంబాలకు రూ.11,130 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు.ప్రస్తుతం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల సాయాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వివాహం అనంతరం ఆర్థిక సాయం అందడంలో జాప్యం కారణంగా పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన తులం బంగారం పథకాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం పేదింటి ఆడబిడ్డలకు అన్యాయమని పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు తులం బంగారం హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, కుంభతిని రాము, గోరింట్ల వెంకటేశ్వరరావు, ఎడ్ల రాందాస్, కనుకు భద్రం, అలవాల కృష్ణ, పాసిగంటి సంతోష్, సయ్యద్ సాదిక్, రాట్నాల శ్రీరామ్మూర్తి, గాదంశెట్టి కిషోర్, ఇన్నమురి సృజన్, కుకడపు సాయి, సాంబశివరావు, మైపా వెంకటేశ్వర్లు, పంజా సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## చలో వరంగల్‌కు బీఎస్పీ పిలుపు

**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి ):** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షిరాం 20వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 9న నిర్వహించనున్న 'చలో వరంగల్' బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం చర్ల మండలంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు యాసం సిద్ధార్థపూలే మాట్లాడుతూ మహనీయులు జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కలలుగన్న బహుజన రాజ్యాధికార సాధన కోసం కాన్షిరాం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ వేదికగా బహుజన్ సమాజ్ పార్టీని ఏర్పాటు చేసి, బహుజనులు తమ ఓటు హక్కును రాజకీయ అధికార సాధనకు ఉపయోగించుకునేలా కాన్షిరాం మార్గనిర్దేశం చేశారని కాన్షిరాం 20వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 9న వరంగల్, హైదరాబాద్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలకు జిల్లా నుంచి విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, యువత, అణగారిన, పేద ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి బహుజన రాజ్యాధికార సాధన ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు చెన్నం మోహన్‌రావు, జిల్లా ఈసీ మెంబర్ వీసంపల్లి నర్సింహారావు, చర్ల మండల అధ్యక్షులు పాయల మోహన్‌రావు, ధ్రువ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 4 న కొత్తగూడెంలో జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 2,(ప్రజాజ్యోతి )** కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 వ తేదీన ఉదయం 8 గంటల నుండి ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. మహీధర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ పోటీల్లో విజేతలకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్ లు బహుకరించడం జరుగుతుంది అని ,ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబర్ లో హైదరాబాద్ లో నిర్వహించనున్న జాతీయ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఈ నెల 11 న ఆసిఫాబాద్ లో జరగబోయే రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు పంపుతామని తెలిపారు, ఈ పోటీలను అండర్-10 అండర్-12, అండర్-14 అండర్-16 బాల, బాలికల విభాగాల్లో నిర్వహించనున్నార నీ ,ఇందులో 60 మీటర్లు, 100 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్ల 1000 మీటర్, , లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 4 వ తేదీన ఉదయం 8:00 గంటలకు ప్రకాశం స్టేడియం కొత్తగూడెం లో అథ్లెటిక్స్ కోచ్ డి. మల్లికార్జునరావు కు రిపోర్ట్ చేయాలని కోరారు.మరిన్ని వివరాల కోసం 99486 01361నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# జర్నలిస్టుల నిరసనతో మారుమోగిన భద్రాచలం

- జర్నలిస్టుల భద్రతకు జాతీయ చట్టం తీసుకురావాలి
- హెల్త్ కార్డులు, పక్కా గృహాలు మంజూరు చేయాలి
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) భద్రాచలం పట్టణ, డివిజన్ కమిటీలు








**భద్రాచలం, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి):** జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు పాత్రికేయుల సంక్షేమం కోసం జాతీయ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా డివిజన్, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జాతీయ కౌన్సిల్ సభ్యులు బివి రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సోముల గిరిప్రసాద్ పాల్గొన్నారు.ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం అక్కడి నుంచి పాత మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు.

>> జర్నలిస్టులకు జాతీయ భద్రత చట్టంతోపాటు హెల్త్ కార్డులు, పక్కా గృహాలు మంజూరు చేయాలి

ఈ సందర్భంగా ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు బి.వి. రమణారెడ్డి, భద్రాచలం పట్టణ అధ్యక్షులు విజ్జిగిరి రాజా కిరణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రత కోసం జాతీయ చట్టం తీసుకురావాలని, నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల కింద ఉన్న చట్టబద్ధ హక్కులను పునరుద్ధరించి, కొత్త వేతన మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పక్కా గృహాలు కల్పించాలని, జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజులో 50 శాతం రాయితీ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డి మాండ్ చేశారు. కార్యక్రమంలో ఐజేయూ ఆర్గనైజింగ్ కార్యదర్శి సోముల గిరిప్రసాద్, పట్టణ కోశాధికారి నాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు ప్రభుదాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్రంశెట్టి కృష్ణ, మదర్, నియోజకవర్గ కమిటీ కోశాధికారి రాము, కార్యదర్శి జయరాం, కోశాధికారి బి. బాలకిరణ్, యూనియన్ సీనియర్ నాయకులు జ్ఞానేందర్, సోమ రైతు శ్రీనివాసరావు, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిల్లి రాజు, ప్రే మ్ కుమార్, దిలీప్ కుమార్, బా బు నాయుడు, జగన్, ప్రదీప్, మున్నా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. దుమ్ముగూడెం, చర్ల మండలాల నుంచి పలువురు యూనియన్ సభ్యులు హాజరయ్యారు.

# గాంధీజీ ఆశయాలు చిరస్మరణీయం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్ రావు



**చర్ల, అక్టోబర్ 02: (ప్రజా జ్యోతి ):** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఇర్పా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సత్యం, అహింస, సత్యాగ్రహ మార్గాల ద్వారా బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహాత్మా గాంధీ దేశానికి మార్గదర్శకుడని అన్నారు.యువత గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ, సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రంకి బాబ్జి, జవాది రవి, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, చల్ల కోటి వాసు, జితేంద్ర నాయుడు, సుందర సురేష్, పటేల్ వెంకటేశ్వర్లు, బాలు నాయుడు, రవికాంత్, పరిటాల సంతోష్, కుమార్ బాబు, తోటమల్ల వరప్రసాద్, కనితి శ్రీనివాస్, శ్యామల, తరుణ్, చిప్పనపల్లి శ్రీనివాస్, గోరంట్ల శ్రీనివాస్ తదితరులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలు ఆదర్శనీయం

- టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులు డెక్క సింహరావు, గగ్గూరి బాలకృష్ణ



**భద్రాచలం, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి):** మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిలు దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయులని టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులు డెక్క సింహరావు, గగ్గూరి బాలకృష్ణ అన్నారు.శుక్రవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.గాంధీజీ సత్యం, అహింసా సిద్ధాంతాలతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలను నడిపారని తెలిపారు.శాస్త్రి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని పలుమార్లు జైలు శిక్ష అనుభవించారని పేర్కొన్నారు.స్వతంత్ర భారతదేశ రెండో ప్రధానమంత్రిగా శాస్త్రి దేశాన్ని సమర్థవంతంగా నడిపించారని, 1965 యుద్ధ సమయంలో ఇచ్చిన 'జై జవాన్–జై కిసాన్' నినాదం చిరస్మరణీయమని అన్నారు.స్వదేశీ వస్తువుల వినియోగం, గ్రామీణాభివృద్ధి, నిరాడంబరత, సమానత్వం కోసం వారు చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు.వారి నిజాయితీ, దేశభక్తి, త్యాగనిరతి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.కార్యక్రమంలో టీఎన్జీవోస్ కార్యవర్గ సభ్యులు గాంధీ రామేశ్వర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సేవాభావం అభినందనీయం

- భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట



**భద్రాచలం, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి):** విద్యార్థుల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఆర్వో ప్లాంట్ భవనాన్ని నిర్మించి ఇవ్వడం అభినందనీయమని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట అన్నారు. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1976–78 ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ భవనం నిర్మించడం ద్వారా పూర్వ విద్యార్థులు తమ సేవాభావాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిరుమలరావు, వెంకన్న, శ్రీనివాసరావు, సత్యప్రసాద్, ఆదినారాయణ, పూర్వ అధ్యాపకులు సుభాష్ చంద్రబోస్, విశ్రాంత ప్రిన్సిపల్ తిప్పన సిద్ధులు, కళాశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు ఆనంద్ బాబు, శ్రీనివాసరావు, మాన్ సింగ్, పిండిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు భరోసాగా షాదీ ముబారక్

- పేద కుటుంబాల ఆడబిడ్డల అండగా నిలిచిన కేసీఆర్
- బి ఆర్ఎస్ యువజన అధ్యక్షుడు: గద్దల రామకృష్ణ
- అశ్వాపురంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**అశ్వాపురం:అక్టోబర్ 2,ప్రజాజ్యోతి** పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ షాదీ ముబారక్ పథకం ఎంతోమంది కుటుంబాలకు అండగా నిలిచిందని బి ఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అశ్వాపురం మండల కేంద్రంలో బి ఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో షాదీ ముబారక్ పథకాన్ని గుర్తుచేస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం అంటే తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పదని, అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కొంతమేర ఊరట కల్పించిందని నాయకులు తెలిపారు. వివాహ సమయంలో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొనే పేద కుటుంబాలకు షాదీ ముబారక్ పథకం ఆర్థికంగా ఉపయోగపడిందన్నారు.పేదింటి ఆడబిడ్డల వివాహాలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలను అమలు చేయడం ద్వారా ప్రభుత్వం అండగా నిలిచిందని గద్దల రామకృష్ణ పేర్కొన్నారు. పథకం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలకు కలిగిన ప్రయోజనాలను ఆయన వివరించారు. పేద కుటుంబాల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు చల్ల రాజేష్, బీసీ సెల్ అధ్యక్షులు భాగవతపు సతీష్, ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్కే నజీర్, మంద రాంబాబు జరుకుల నరేష్ ఇరుగు కృష్ణ తేజ, భరత్ నాయక్, గొలుసు వెంకటేష్,కుంజ సుదర్శన్, ఇరుగు గోపయ్య, రవి, కుంటు రాకేష్, బానోత్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**దమ్మపేట, అక్టోబర్ 2, ( ప్రజాజ్యోతి):** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచనల మేరకు మాజీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు 2014లో కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించిందన్నారు. ముస్లిం మైనారిటీ యువతుల కోసం షాదీ ముబారక్ పథకాన్ని అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం హామీని అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, గాజుబోయిన యేసుబాబు, రావూరి వీరయ్య, వెలుగోటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా జర్నలిస్టుల ధర్నా

- జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు- హెల్త్ కార్డులు, ఇతర సమస్యలను పరిష్కరించాలి





**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 2, (ప్రజా జ్యోతి )** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు కొత్తగూడెం జిల్లా టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెవి రత్నం , జూను మాల రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నాగచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ధర్నాచకు వద్ద శాంతియుతంగా ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు ప్రతిసారి విఫలమవుతున్నాయని అన్నారు, గత ప్రభుత్వ హయాంలో కానీ, ప్రస్తుత ప్రభుత్వంలో ఆయా జిల్లాలలో ఉన్న మంత్రులు గాని, ఎమ్మెల్యేలు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ,ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప వాటికి పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, ఎప్పటికైనా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, విధి నిర్వహణలో జర్నలిస్టులకు భద్రత సౌకర్యం, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు, అనంతరం ధర్నా చౌక్ నుండి ప్రదర్శనగా వెళ్లి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు, "జర్నలిస్టుల సమర శంఖంకు" పలువురు సంఘీభావం కలెక్టరేట్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిర్వహించ తలపెట్టిన సమర శంఖం కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పాల్గొని జర్నలిస్టులకు సంఘీభావం ప్రకటించారు, ఈ కార్యక్రమానికి కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ప్రజా వేదిక కన్వీనర్ కొండపల్లి శ్రీధర్, బి ఆర్ఎస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, జై భీమ్ రాష్ట్ర నాయకులు ఎర్ర కామేష్, బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్ పార్టీ రాష్ట్ర నాయకులు ముద్దా భిక్షం, వివిధ పార్టీల నాయకులు పాల్గొని జర్నలిస్టుల ఉద్దేశించి మాట్లాడారు, రాష్ట్రంలో జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలతో పాటు ఎలాంటి షరతులు లేకుండా హెల్త్ కార్డులు మంజూరు చేసి కార్పొరేట్ హాస్పిటల్ లో అన్ని రకాల వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు, జర్నలిస్టుల హక్కుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూజే రాష్ట్ర నాయకులు దద్దుకూరి రామారావు తోపాటు పాల్వంచ డివిజన్ అధ్యక్షులు అనుముల గుర్తి అబ్బురామ్, సీనియర్ పాత్రికేయులు ఎండి జైనులబుద్దిన్, గాడేపల్లి వీరభద్రం, రుద్రారపు సంజీవ్ కుమార్, ఎడ్లపల్లి శ్రీనివాసరావు, బి కిషోర్ కుమార్, పి వెంకటనారాయణ, జిల్లాలోని వివిధ డివిజన్ కు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక కొరతతో అభివృద్ధి పనులకు ఆటంకం

- అధికారులు పూర్తి సమాచారంతో గ్రామసభకు హాజరు కావాలి
- 4వ వార్డు మెంబర్ బండారు శరత్‌బాబు



**భద్రాచలం, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి ):** భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ జరిగింది. గ్రామసభకు ముఖ్యఅతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా 4వ వార్డు మెంబర్, సీపీఐఎం ఫ్లోర్ లీడర్ బండారు శరత్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులకు ఇసుక కొరత ఏర్పడటంతో పలు పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడి అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక అందేలా టోకెన్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా గ్రామసభకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాల్సి ఉండగా పలువురు అధికారులు హాజరు కాకపోవడం విచారకరమని బండారు శరత్‌బాబు పేర్కొన్నారు. ప్రజలు లేవనెత్తే సమస్యలకు సమాధానాలు ఇవ్వాలంటే సంబంధిత అధికారులు తప్పనిసరిగా గ్రామసభకు హాజరు కావాలని కోరారు.దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇకపై గ్రామసభలకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలో వచ్చిన అంశాలపై సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష.. కొత్తజనాపురంలో గ్రామసభ

- ఉపాధి హామీ పనులపై చర్చించిన గ్రామసర్పంచ్ వజ్జా రామారావు



**సుజాతనగర్, అక్టోబర్ 2 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం కొత్త అంజనాపురం గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వజ్జా రామారావు సమావేశంలో గ్రామ అభివృద్ధి, ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పలు పనులపై చర్చించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో చేపట్టనున్న చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఇతర అభివృద్ధి పనులు తదితర అంశాలపై గ్రామస్తులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గ్రామసభలో సుజాతనగర్ పీహెచ్‌సీ ఏఎన్‌ఎం, గూగులోత్ పద్మజ, పంచాయతీ సెక్రటరీ, ఉపసర్పంచ్ ఆదినారాయణ, సర్పంచ్ వజ్జా రామారావుతో పాటు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. సమావేశంలో గ్రామ సమస్యలు, అభివృద్ధి పనులపై గ్రామస్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఆరోగ్యంపై అవగాహన కల్పించిన ఏఎన్‌ఎం గుగులోత్ పద్మజ మాట్లాడుతూ గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్యం, పరిశుభ్రత ఎంతో ముఖ్యమని సూచించారు. ఇళ్ల పరిసరాలు, వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవడంతో పాటు సైడ్ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున దోమల నివారణకు ప్రజలు సహకరించాలని ఆమె సూచించారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు

- విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి





**ములకలపల్లి, అక్టోబర్ 2 (ప్రజాజ్యోతి ):** గ్రామాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించి, వాటిని దశలవారీగా అమలు చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ములకలపల్లి మండలం జగన్నాధపురం రైతువేదిక, సీతాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు కమలాపురం, గుట్టగూడెం గ్రామపంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల అవసరాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తే, వాటిని దశలవారీగా అమలు చేసి అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను తన దృష్టికి తీసుకువస్తే వాటి అమలుకు కృషిచేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పథకాల అమలులో రాజకీయాలకు తావులేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎలాంటి స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా నిజమైన పేదలకు ఇళ్లు అందేలా చూడాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. గుడిసెలు లేని అశ్వారావుపేట నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే విద్య, వైద్య రంగాలకు రాజకీయ ప్రయోజనాలతో సంబంధం లేకుండా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ రెండు రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారికి మంచి భవిష్యత్తును అందించడమే లక్ష్యమన్నారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు కుంజా వినోద్, కారం చంద్రలేఖ రాములు, తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీవో సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జహీర్, పీసీసీ జిల్లా సభ్యుడు తాండ్ర ప్రభాకర్‌రావు, కారం సుధీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి..!



**ములకలపల్లి, అక్టోబర్ 2 (ప్రజాజ్యోతి ):** ప్రజల భాగస్వామ్యంతోనే సమాజం, పర్యావరణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని నర్సాపురం గ్రామంలో ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "సమాజం–పర్యావరణ సమగ్ర అభివృద్ధికి సమన్వయ విధానం" అనే అంశంపై రైతులు, గ్రామస్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 90 మంది రైతులతో పాటు ధాన్ ఫౌండేషన్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబం, సమాజం, పర్యావరణ సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం, గ్రామ నాయకత్వం, జీవనోపాధి అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. గ్రామ ప్రజలే తమ అభివృద్ధికి నాయకత్వం వహించేలా ప్రజల యాజమాన్య భావన, నాయకత్వాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అనుసంధానం చేయడం ద్వారా స్థిరమైన, సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు.

# పేటలో డి-ఫార్మసీ సర్టిఫికెట్ల దందా?

- చదువుకున్న వారి సర్టిఫికెట్లు లీజుకు.. అర్హత లేనివారికి అప్పగింత?
- ఏడాదికి రూ.5–10 వేలకే అసలు సర్టిఫికెట్.. బయట రూ.20–50 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు
- మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు ఎక్కడ?

**అశ్వారావుపేట, ప్రజా జ్యోతి: అక్టోబర్ 2** అశ్వారావుపేట మండలంలో ఫార్మసీ అర్హతలు, రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ వ్యవస్థ చుట్టూ కొత్త ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. డి-ఫార్మసీ చదివి సర్టిఫికెట్ పొందిన కొంతమంది విద్యార్థుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని, వారి సర్టిఫికెట్లను నిర్దిష్ట కాలానికి తీసుకుని ఇతర మెడికల్ షాపులు లేదా ఫార్మసీ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు కాదు వాస్తవాలు కూడా స్థానికంగా ప్రముఖ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారనే సమాచారం కూడా ప్రచారంలో ఉంది. డి-ఫార్మసీ చదివిన వారి నుంచి సంవత్సరానికి సుమారు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లించి సర్టిఫికెట్లను ఒకటి, రెండు సంవత్సరాలు లేదా ఐదేళ్ల వరకు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదే సర్టిఫికెట్లను అర్హత లేని వ్యక్తులకు ఉపయోగించుకునేలా చేసి, ఒక్కో సర్టిఫికెట్ కు సంవత్సరానికి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

**సర్టిఫికెట్ ఒకరిది.. బాధ్యత మరొకరిదా?**

ఫార్మసీ విద్య పూర్తి చేసిన వ్యక్తి పేరు, అర్హత, రిజిస్ట్రేషన్ ఒకరిదైతే.. వాస్తవంగా మెడికల్ షాపులో మందులు ఎవరు విక్రయిస్తున్నారు? రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ వాస్తవంగా అక్కడ పనిచేస్తున్నారా? లేక సర్టిఫికెట్ ను మాత్రమే ఉపయోగిస్తున్నారా? అన్నది కీలక ప్రశ్నగా మారుతోంది. ఫార్మసీ యాక్ట్ 1948 ప్రకారం రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ కు చట్టపరమైన ప్రాధాన్యం ఉంది. రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ కాకుండా ఇతరులు వైద్యుల ప్రిస్క్రిప్షన్ పై మందులను కాంపౌండ్ ప్రిపేర్ మిక్స్ లేదా డిస్పెన్స్




లేదా చేయడంపై చట్టంలో నిబంధనలు ఉన్నాయి. అందువల్ల ఒకరి విద్యార్హత సర్టిఫికెట్ ను మరొకరి వ్యాపారానికి కేవలం పేరుకే ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే, అది కేవలం సర్టిఫికెట్ లావాదేవీ సమస్య కాకుండా మందుల విక్రయ పర్యవేక్షణ, రోగుల భద్రత, నియంత్రణ వ్యవస్థకు సంబంధించిన అంశంగా మారుతుంది.

**సంవత్సరానికి రూ. 8000 ముడుపుల ఆరోపణలు?**

అశ్వారావుపేట మండలంలోని కొన్ని మెడికల్ షాపుల నుంచి సంవత్సరానికి సుమారు రూ.8000 చొప్పున వసూలు చేసి సంబంధిత శాఖ అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారనే మరో తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక ఆధారాలు బయటకు రావాల్సి ఉంది. ? ఎవరికి వెళ్తున్నాయి? ఎవరి పేరుతో వసూలు చేస్తున్నారు? అనే విషయాలపై డ్రగ్ కంట్రోల్ శాఖ సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

**అధికారుల మౌనం ఎందుకు?**

ఒకవైపు అర్హత పొందేందుకు డి-ఫార్మసీ చదివిన విద్యార్థులు సంవత్సరాల పాటు విద్యను అభ్యసిస్తుంటే, మరో వైపు వారి సర్టిఫికెట్లు కేవలం ఆర్థిక అవసరాల కోసం అద్దెకు తీసుకుని ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే అది వ్యవస్థలోని లోపాలను బయటపెడుతుంది. ముఖ్యంగా అర్హత లేని వ్యక్తులు రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ పేరుతో మందుల విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా? అన్న అంశాన్ని అధికారులు స్పష్టంగా తేల్చాల్సి ఉంది.

**ప్రజల ప్రాణాలతో చెలగాటమా?**

మందులు సాధారణ వస్తువులు కావు. తప్పు మందు, తప్పు మోతాదు లేదా తప్పు సూచన రోగికి నష్టం కలిగించే అవకాశం ఉంటుంది. అందుకే ఫార్మసీ రంగంలో అర్హత, రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు చట్టం ప్రాధాన్యం ఇస్తోంది. కాబట్టి అశ్వారావుపేటలో వినిపిస్తున్న సర్టిఫికెట్ లీజు, అర్హత లేని వ్యక్తులకు వాటి వినియోగం, నెలవారీ ముడుపుల ఆరోపణలపై డ్రగ్ కంట్రోల్ శాఖ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలనే డిమాండ్ పెరుగుతోంది.

# కాసుల కోసం కక్కుర్తి.. గిరిజన రోగులే టార్గెట్?

- ఆర్ఎంపీల వైద్య నిర్వహణపై అనేక అనుమానాలు..
- అవసరం లేకున్నా కార్పొరేట్ ఆసుపత్రులకు తరలింపుల ఆరోపణలు
- అర్హత ఎంత? వైద్యం చేసే అధికారం ఉందా? గిరిజన ప్రాంతాల్లో పర్యవేక్షణ ఏది?

**ప్రత్యేక కథనం | ప్రజా జ్యోతి అక్టోబర్ 2**

గిరిజన ప్రాంతాల్లో వైద్యం పేరుతో జరుగుతున్న వ్యవహారాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పుకునే కొందరు ఆర్ఎంపీ వైద్యుల వ్యవహారశైలిపై స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజనులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో అజ్ఞానం, ఆర్థిక ఇబ్బందులు, వైద్యంపై అవగాహన లేమిని ఆసరాగా చేసుకుని అవసరం




లేని వైద్య పరీక్షలు, చికిత్సలు, ఆపరేషన్లకు రోగులను ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

**అర్హత లేకుండానే వైద్యం?**

ఆర్ఎంపీగా పనిచేస్తున్న ప్రతి వ్యక్తికి రోగులను పరీక్షించి, వ్యాధి నిర్ధారణ చేసి, మందులు సూచించి, చికిత్స అందించే పూర్తి చట్టబద్ధ అధికారం ఉందా? అన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. అర్హతలు, రిజిస్ట్రేషన్, వైద్య విధానాలపై నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పాటిస్తున్నారా లేదా అన్నది సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**గిరిజన రోగులే ఎందుకు?**

అవగాహన తక్కువగా ఉన్న గిరిజన ప్రాంతాల్లోనే ఇలాంటి ఆరోపణలు ఎందుకు వినిపిస్తున్నాయి? సాధారణ సమస్యకు కూడా పెద్ద ఆసుపత్రికి వెళ్లాలని సూచించడం వెనుక అసలు కారణం ఏమిటి? అవసరమైన వైద్యం మాత్రమే జరుగుతోందా.. లేక అదనపు పరీక్షలు, చికిత్సలు, శస్త్రచికిత్సల వరకు వ్యవహారం వెళ్తుందా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. “రోగికి నిజంగా ఆపరేషన్ అవసరమా?” అనే ప్రశ్నకు స్పష్టమైన వైద్య ఆధారం లేకుండా ఎవరినీ ఆపరేషన్ వైపు నెట్టడం సరికాదు. అలాంటి ఆరోపణలు ఉంటే వైద్య రికార్డులు, రెండో వైద్య అభిప్రాయాలు, ఆసుపత్రి బిల్లులు, పరీక్షల నివేదికలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**కార్పొరేట్ ఆసుపత్రులకు తరలింపు వెనుక ఎవరు?**

గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక వైద్యం అందించాల్సిన పరిస్థితిలో ఉన్న రోగిని పదేపదే కార్పొరేట్ ఆసుపత్రికి ఎందుకు పంపిస్తున్నారు? ఆ ఆసుపత్రులతో ఆర్ఎంపీలకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా? రోగిని రిఫర్ చేసిన ప్రతిసారీ ఏదైనా ఆర్థిక ప్రయోజనం ఉందా? అనే ఆరోపణలు ఉంటే వాటిపై అధికారిక విచారణ జరగాల్సిందే.

**డీఎంహెచ్ఓ పర్యవేక్షణ ఎక్కడ?**

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అనధికార వైద్యం లేదా నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందుతున్నాయా అనే అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఆరోపణలు వస్తున్నప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారా? అనర్హులు వైద్యం చేస్తున్నట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ప్రైవేట్ ఆసుపత్రులకు రోగుల రిఫరల్ విధానాన్ని పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**గిరిజనుల ప్రాణాలతో చెలగాటం కాకూడదు**

వైద్యం అనేది వ్యాపార లావాదేవీ కాదు. ముఖ్యంగా పేద, గిరిజన కుటుంబాలకు వైద్య నిర్ణయం అనేది వారి జీవితాన్నే ప్రభావితం చేసే విషయం. రోగికి తన వ్యాధి, చికిత్స, ఆపరేషన్ అవసరం, ఖర్చు వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య వ్యవస్థపై ఉంది. అవగాహన లేని పరిస్థితిని ఎవరైనా తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటే అది అత్యంత తీవ్రమైన ఆరోపణగా మారుతుంది. అందుకే ఆరోగ్య శాఖ అధికారులు ఆరోపణలను కేవలం కాగితాలపై కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.